మల్యాల: లంబాడిపల్లిలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కోరుట్ల: పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా తొలి ఏకాదశి

- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- గ్రామాల్లో పండుగ సందడి

జగిత్యాల/సారంగాపూర్/మల్యాల/మారుతీనగర్/ కోరుట్ల, జూలై 17: జిల్లా ప్రజలు బుధవారం తొలి ఏకాదశి పండుగను ఘనంగా జరుపుకొన్నారు. జిల్లా కేంద్రంతో పాటు గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సారంగాపూర్ మండలం పెంబట్ల దుబ్బ రాజేశ్వర స్వామి, బీర్‌పూర్ లక్ష్మీనరసింహ స్వామి, రేచపల్లి జగన్నాథ స్వామి, సారంగాపూర్ సీతారామచంద్ర స్వామి, తదితర ఆలయాల్లో భక్తులు స్వామి వారలను దర్శించుకున్నారు. అలాగే, మల్యాల మండలం ముత్యంపేటలోని కొండగట్టు ఆంజనేయ స్వామి, లంబాడిపల్లిలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో తొలి ఏకాదశి పండుగ సందర్భంగా పిండి వంటలు చేసుకుని, వేడుకలను జరుపుకొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి, జూలై 17: ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో తొలి ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు ప్రధాన ఆలయంతో పాటు అనుబంధ ఆలయాల్లో స్వామివారలను దర్శించుకున్నారు. అంతకుముందు గోదావరి నదిలో స్నానాలాచరించి సంకల్పాది పూజలు జరిపించుకున్నారు. భక్తులు ఇబ్బందులు పడకుండా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

మెట్‌పల్లి రూరల్: కొండ్రికర్లలో పీరీలను ఊరేగిస్తున్న భక్తులు

ధర్మపురి: పట్టణంలో పీరీలకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో మొహర్రం

సారంగాపూర్/కోరుట్ల/కోరుట్ల రూరల్/ధర్మపురి/మేడిపల్లి/మెట్‌పల్లి రూరల్, జూలై 17: జిల్లా వ్యాప్తంగా బుధవారం మొహర్రం వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పీరీలకు కందురలు, మలిదలు, కుడుకల పేర్లు, దస్తీలు, కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం పట్టణాలతో పాటు గ్రామాల్లోని వీధుల్లో పీరీల ఊరేగించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చౌదరిలు భక్తి పారవశ్యంతో పీరీలను ఎత్తుకోగా, వేడుకల్లో యువకులు పులివేషధారణలో ఆకట్టుకున్నారు. పలువురు విచిత్ర వేషాలతో హంగామా చేశారు. అనంతరం గ్రామ శివారుల్లోని చెరువులు, కుంటల్లో పీరీలను నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ప్రజాప్రతినిధులు, ముస్లింలు, యువత, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల: పట్టణంలో పులి వేషధారణలో సందడి చేస్తున్న యువకులు

నేడు వన మహోత్సవం

మెట్‌పల్లి, జూలై 17: పట్టణంలో ఈనెల 18న మున్సిపల్ ఆధ్వర్యంలో వన మహోత్సవం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ మోహన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 13వ వార్డులోని బాలకిషన్‌నగర్, కూప్‌సింగ్ కుంట పార్కులో జరిగే ఈ వన మహోత్సవానికి ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, మున్సిపల్ అధ్యక్షురాలు రాణవేని సుజాత హాజరవుతారని పేర్కొన్నారు. కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు హాజరుకావాలని కోరారు.

వృద్ధుల పోషణ బాధ్యత పిల్లలదే

జగిత్యాల, జూలై 17: వయోవృద్ధులైన తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ బాధ్యత పిల్లలదేనని, విస్మరిస్తే వయోవృద్ధుల చట్ట ప్రకారం చర్యలు తప్పవని తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని అసోసియేషన్ కౌన్సెలింగ్ కేంద్రంలో బుధవారం వయోవృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం కింద అసోసియేషన్‌కు వచ్చిన ఫిర్యాదుల మేరకు సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్ ప్రతినిధులు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జగిత్యాల పట్టణంకు చెందిన ముత్యపు రాజయ్య, ధర్మపురికి చెందిన గద్దె నరహరి, అనసూయ, మెట్‌పల్లికి చెందిన కర్కల శంకరయ్య, లక్ష్మి వయోవృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం కింద తమ కుమారులకు కౌన్సెలింగ్ చేయాలని సీనియర్ సిటీజన్స్ జిల్లా కమిటీకి విన్నవించారు. ఈ మేరకు బాధితుల కొడుకులు, కోడళ్లను, కూతుళ్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. వయోవృద్ధులైన తల్లిదండ్రులను నిరాదరణకు గురిచేస్తే సంబంధించిన డివిజన్ల ట్రిబ్యునల్ చైర్మన్లు అయిన ఆర్డీవోలు వారికి సంరక్షణ చట్టం 2007 సెక్షన్ 24 ప్రకారం 6 నెలల వరకు జైలు శిక్షతో పాటు జరిమానా విధించే వీలుందని హెచ్చరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ప్రతినిధులు విశ్వనాథం, విజయ్, ప్రకాశ్ రావు, గంగాధర్, ఎండీ యాకూబ్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

మల్లాపూర్, జూలై 17: మండలంలోని రాఘవపేట గ్రామంలో గల విద్యుత్ సబ్ స్టేషన్ కార్యాలయ ఆవరణలో గురువారం విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక (లోకల్ కోర్టు) నిర్వహిస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏడీఈ శ్రీనివాస్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక చైర్మన్ రామకృష్ణ, మెంబర్ ఫైనాన్స్ కిషన్, మెంబర్ రాజాగౌడ్ హాజరవుతారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండలాల వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
OLD AGE HOME
★ఒంటేగా హోంకేర్: వంట, ఇంటిపని, వృద్ధులకు, పేషెంట్లను, చిన్నపిల్లలను 24 గం॥ చూసుకొనుటకు మీ ఇంటివద్దకే Sr. కేర్‌టేకర్స్‌ని పంపబడును, హైదరాబాద్. 8977639664, 8977639665.
NT-325763-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571

వన మహోత్సవానికి సర్వం సిద్ధం

- నర్సరీలో లక్ష మొక్కల పెంపకం
- సంరక్షణకు ప్రత్యేక సిబ్బంది ఏర్పాటు

పట్టణంలోని నర్సరీలో షెడ్ నెట్ కింద పెంచుతున్న మొక్కలు

కోరుట్ల, జూలై 17: పట్టణంలో వనమహోత్సవం కార్యక్రమానికి బల్దియా అధికారులు సర్వం సిద్ధం చేశారు. లక్ష మొక్కలు నాటడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. నర్సరీల్లో మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. నర్సరీల్లో పెంచిన మొక్కలను పట్టణంలోని ప్రభుత్వ భూములు, రహదారులకు ఇరువైపులా, పారిశ్రామిక ప్రాంతాలు, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల పరిసరాలు, ఇండ్ల ఆవరణలో, ప్రార్థన మందిరాలు, ఆలయ ప్రాంగణాలు, పోలీస్‌స్టేషన్, రెవెన్యూ, రైల్వేస్టేషన్ పరిసరాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఆవరణలో మొక్కలను నాటించి పట్టణాన్ని పచ్చదనంతో నింపాలనే లక్ష్యంతోతో మున్సిపల్ శాఖ కసరత్తు చేస్తున్నది.

పట్టణంలో ప్రత్యేక నర్సరీ ఏర్పాటు

పట్టణంలో మొక్కల పెంపకం కోసం పట్టణ ప్రగతి నిధులతో అయ్యప్ప గుట్ట వద్ద ఎకరంన్నర స్థల విస్తీర్ణంలో రూ. 30 లక్షలు వెచ్చించి నర్సరీని అధికారులు గతంలో ఏర్పాటు చేశారు. పట్టణ అవసరాల దృష్ట్యా ఇందులో ప్రస్తుతం లక్ష మొక్కలను పెంచుతున్నారు. నిత్యం మొక్కలకు నీరందించేందుకు బోరు బావి తవ్వించి, మొక్కలకు ఎండ బారి నుంచి రక్షణ కోసం షెడ్ నెట్‌లను అమర్చి సంరక్షిస్తున్నారు. మొక్కలు చిన్నగా ఉండి నాటే సమయంలో చనిపోయే ప్రమాదం ఉందని విత్తనాలు మొలకెత్తే దశలోకి వచ్చిన తర్వాత మరింత రక్షణ కోసం పాలిథిన్ కవర్‌లోకి మార్చి రక్షణ చర్యలు తీసుకుంటున్నారు. మొక్కల సత్వర ఎదుగుదలకు కావాల్సిన నాణ్యమైన మట్టి, ఎరువుల మిశ్రమాన్ని కలిపి విత్తనాలను నాటించడం మొదలు పెట్టారు. దీంతో నర్సరీ పచ్చదనం పరుచుకొని చిట్టడవిని తలపిస్తున్నది.

అందుబాటులో మొక్కలు

వన మహోత్సవంలో భాగంగా లక్ష మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకున్న అధికారులు నర్సరీల్లో అవసరమైన మొక్కలను అందుబాటులో ఉంచారు. ప్రజలకు పంపిణీ చేసేందుకు మూడు నర్సరీల్లో పూలు, పండ్లు, నీడనిచ్చే సుమారు 25 రకాల మొక్కలు జామ, అల్లనేరేడు, చక్రమల్లె, మందారం, నేరేడు, మల్లె, కోనా కార్పస్, వాటర్ ఆపిల్, గన్నేరు, నూరు వరహాలు, గోరింట, గుల్‌మోహర్, పెల్టోఫోరం, దానిమ్మ, కానుగ, పారిజాతం, టెకోమా, శ్రీగంధం, నెమలి నారా, వేప, టేకు, కదంబా, నిద్ర గన్నేరు, బాదాం, బోహమియా, స్పతోడియా, చింత, సీతాఫలం, నరేపా, సిల్వియా వంటి మొక్కలను సిద్ధంగా ఉంచారు. మున్సిపల్ అధికారులు స్థానికంగా ఉన్న యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధుల సహకారంతో అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు చర్యలు చేపట్టారు. నర్సరీల్లో మొక్కల సంరక్షణ కోసం మున్సిపల్ నుంచి నలుగురు సిబ్బందిని ప్రత్యేకంగా నియమించారు. కాగా, పట్టణంలోని నర్సరీలో ఆరు అడుగుల మేర పెంచిన వివిధ రకాల పండ్లు, పూల మొక్కలు అందుబాటులో ఉంచారు.

నిత్యాన్నదానానికి విరాళం

ధర్మపురి, జూలై 17: ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం నిర్వహించే నిత్యాన్నదాన కార్యక్రమానికి ఓ భక్తురాలు రూ.10 లక్షలను విరాళంగా అందజేశారు. హైదరాబాద్‌లోని మలక్‌పేటకు చెందిన బద్ధం సునీత ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదానం కోసం బుధవారం రూ.5 లక్షలు, ఈనెల 13న రూ.5 లక్షలు అందజేసినట్లు దేవస్థానం ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 8న స్వామి వారి నిత్యకల్యాణోత్సవానికి రెండు మంగళసూత్రాలను అందజేసిన ఆమె నిత్యాన్నదానికి విరాళం అందజేయాలని నిర్ణయించుకొని రూ.10 లక్షలు ఇచ్చినట్లు ఈవో చెప్పారు.

నేటి నుంచి సామూహిక సప్తాహ పారాయణం

కోరుట్ల, జూలై 17: పట్టణంలోని సాయి రామ ఆలయంలో వ్యాస గురు పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం నుంచి ప్రత్యేక వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి కాంతారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25 వరకు కొనసాగే మహాయజ్ఞంలో పాల్గొనేందుకు భక్తులు పేరు నమోదు చేసుకోవాలని కోరారు.

జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంతను సన్మానిస్తున్న మున్నూరు కాపు సంఘం సభ్యులు

జడ్పీ మాజీ చైర్‌పర్సన్‌కు సత్కారం

జగిత్యాల, జూలై 17: జిల్లా కేంద్రంలోని శీలంవాడ హనుమాన్ మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత-సురేశ్‌ను సన్మానించారు. అలాగే, మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడు వొడ్నాల రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి చిట్ల రమణను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో శీలంవాడ-హనుమాన్ మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు శీలం ప్రవీణ్, జగిత్యాల మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ శీలం ప్రియాంక-ప్రవీణ్, హనుమాన్ మున్నూరు కాపు సంఘం నాయకులు జంగిలి ఓంకార్, శీలం శంకర్, రౌతు రవి, నత్తి గంగాధర్, శీలం వేణు, శీలం గంగాధర్, శీలం రాజు, నాలం గంగాధర్, శీలం సుధీర్, శీలం నారాయణ, రమేశ్, సంతోష్, నర్సయ్య, రాయమల్లు, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

మల్యాల, జూలై 17: మల్యాల, కొండగట్టు, పోతారం, తాటిపల్లి, తక్కళ్లపల్లి సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు గురువారం ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు, తిరిగి సాయంత్రం 5.30 నుంచి 6.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ బాలలింగం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నిత్యావసర సరుకులు అందజేత

సారంగాపూర్, జూలై 17: బీర్‌పూర్ మండలం తుంగూర్ గ్రామానికి చెందిన ఆడెపు వెంకటేశ్-సౌమ్య దంపతుల కూతురు శివర్శిని పుట్టిన రోజు సందర్భంగా బుధవారం ఓ నిరుపేద కుటుంబానికి నెలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేశారు. మంగెళ గ్రామానికి చెందిన నిరుపేద నారాపాక గంగాధర్ అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నాడు. విషయం తెలుసుకున్న వెంకటేశ్ తన కూతురు పుట్టిన రోజు సందర్భంగా నిత్యావసర సరుకులతో పాటు కొంత నగదు అందజేశారు.

లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో డీఎస్పీ పూజలు

సారంగాపూర్, జూలై 17: బీర్‌పూర్‌లోని శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో బుధవారం డీఎస్పీ రఘుచందర్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు పెద్ద సంతోష్ కుమార్, చిన్న సంతోష్ కుమార్, మధుకుమార్, సిబ్బంది రాజయ్య, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఏకకాలంలో పంట రుణమాఫీ చేయాలి

మేడిపల్లి, జూలై 17: ఏకకాలంలో రెండు లక్షల పంట రుణమాఫీ చేయాలని రెడ్డి సంఘం మండలాధ్యక్షుడు నోముల నరసింహారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మేడిపల్లి మండలం పోరుమల్ల గ్రామంలో రెడ్డి సంఘం కార్యవర్గ సభ్యులు, రైతులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో రైతులు సురకంటి అంజిరెడ్డి, కందరి శ్రీధర్‌రెడ్డి, కాలగిరి రాజేందర్, పెద్దిరెడ్డి ప్రణయ్, గుర్రాల శ్రీనివాస్, పెద్దిరెడ్డి లక్ష్మీనారాయణ, జలపతి, అన్‌రెడ్డి తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్ సేవలు ప్రారంభం

పెగడపల్లి, జూలై 17: నంచర్ల సహకార సంఘం పెట్రోల్ బంక్ సేవలు తిరిగి ప్రారంభించినట్లు సంఘం చైర్మన్ మంత్రి వేణుగోపాల్, కార్యదర్శి మధుకర్ పేర్కొన్నారు. కరోనా సమయంలో పెట్రోల్ బంక్ సేవలు నిలిచిపోయినట్లు తెలిపారు. ఐవోసీ కంపెనీ ఆధ్వర్యంలో రూ.50 లక్షలతో కన్జ్యుమర్ పంపుగా ఏర్పాటు చేసి, వినియోగదారులకు తిరిగి సేవలందిస్తున్నట్లు వివరించారు.

వివాహిత ఆత్మహత్య

మేడిపల్లి, జూలై 17: భీమారం మండలం కమ్మరిపేట గ్రామానికి చెందిన ఓ వివాహిత గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ శ్యామ్‌రాజ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కమ్మరిపేటకు చెందిన తీపిరి శ్రావణి అలియాస్ మాలతి(25) కొడుకు సహర్ష మంగళవారం కడుపునొప్పితో బాధపడగా, చికిత్స కోసం డాక్టర్ వద్దకు తీసుకెళ్లే విషయంలో భర్తతో గొడవ జరిగింది. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన మాలతి గడ్డి మందు తాగింది. దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. మాలతి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

గోరింటాకు వేడుకలు

రాయికల్, జూలై 17: పట్టణంలోని కేశవనగర్ పద్మశాలీ మహిళా యువజన సంఘంలో గోరింటాకు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా పద్మశాలీ యువజన సంఘం సభ్యులు ఎలిగేటి షర్మిల, గంట్యాల లక్ష్మిశ్రీ, కౌన్సిలర్ ఎలిగేటి లతీక, పద్మ, రమ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో చిన్నారికి తీవ్ర గాయాలు

సారంగాపూర్, జూలై 17: బీర్‌పూర్ మండలం మంగెళ పంచాయతీ పరిధిలోని గొండుగూడెం గ్రామానికి చెందిన దివ్వ అనూష్ (7) కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు. అనూష్ మంగళవారం సాయంత్రం ఇంటి ముందు ఆడుకుంటుండగా కుక్కలు దాడి చేయడంతో తల, చెవి, ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. పంచాయతీ అధికారులు స్పందించి కుక్కల బెడదను నివారించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

జగిత్యాల రూరల్, జూలై 17: నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి టీటీడీ నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జగిత్యాల పరిధిలోని 9 ఆలయాలకు ఒక్కో ఆలయానికి రూ. 10 లక్షల చొప్పున టీటీడీ మంజూరు చేసిందన్నారు. టీటీడీ చైర్మన్, ధర్మకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అన్నదాతలకు ఏకకాలంలో రూ.2 లక్షల పంట రుణమాఫీ అమలు చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్నారు. రైతుల పక్షాన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్లు కోరె గంగమల్లు, కూసరి అనిల్, కూతురు రాజేశ్, వొద్ది శ్రీలత-రామ్మోహన్, నాయకులు తక్కురి మల్లేశం, రఘుపతి, రాజన్న, సురేశ్ రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు సత్కారం

న్యాయవాదులను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

రాయికల్, జూలై 17: రాయికల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ న్యాయవాద దినోత్సవాన్ని పురస్కరించుకొని న్యాయవాదులను సన్మానించారు. న్యాయవాదుల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హన్మాండ్లు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శేఖర్, రమేశ్, రాంరెడ్డి, నవీన్, భూమయ్య, గంగాధర్, నర్సయ్య పాల్గొన్నారు.

దుబ్బ రాజన్న ఆలయంలో పీఠాధిపతి ప్రవచనాలు

సారంగాపూర్, జూలై 17: మండలంలోని పెంబట్ల దుబ్బ రాజేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ఆషాఢ శుద్ధ ఏకాదశి సందర్భంగా నైమిశారణ్యం పీఠాధిపతి శ్రీబాల బ్రహ్మానంద సరస్వతీ భక్తులకు దేవి ప్రవచనాలు బోధించారు. మొదట ఆలయానికి వచ్చిన పీఠాధిపతికి ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ఆవరణలో దేవీ భాగవత ప్రవచనాలు వివరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కొస్న కాంతారెడ్డి, ఆలయ ట్రస్టు వ్యవస్థాపక కుటుంబ సభ్యుడు పొరండ్ల శంకరయ్య, గ్రామస్తులు, నాయకులు, భక్తులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

మల్యాల, జూలై 17: మల్యాల మండలం ముత్యంపేట శివారులోని పొలంలో పడి ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ముత్యంపేటకు చెందిన మల్యాల గంగాధర్ (40) బుధవారం గ్రామానికి చెందిన కొంతమందితో కలిసి విందు చేసుకున్నాడు. ఈ క్రమంలో బహిర్భూమికి వెళ్లిన గంగాధర్ విందు చేసుకున్న సమీప ప్రాంతంలోని ఓ పొలంలో పడి మృతి చెందాడు. ఘటనా స్థలానికి ఎస్ఐ నరేశ్ వెళ్లి పరిశీలించారు. గంగాధర్ కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఎక్కిన పెద్దపులి

- మొహర్రం సందర్భంగా పులి వేషధారణలో యువకుడి నృత్యం

బస్సుపై పులి వేషధారణలో నృత్యం చేస్తున్న యువకుడు

మల్లాపూర్, జూలై 17: ఈ చిత్రంలో ఆర్టీసీ బస్సుపై తెల్లగా ఉన్నది పెద్దపులి అనుకుంటున్నారా..? కానే కాదు. అది టైగర్ వేషధారణలో ఉన్న ఓ యువకుడు. బుధవారం మొహర్రం సందర్భంగా వేడుకలు ఘనంగా జరుపుకోగా, మల్లాపూర్ మండల కేంద్రంలో ఓ యువకుడు పులి వేషధారణలో ఆర్టీసీ బస్సుపై ఎక్కాడు. కాసేపు నృత్యం చేసి గ్రామస్తులను నవ్వించగా, 'నమస్తే' క్లిక్ మనిపించింది.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

బాధిత కుటుంబసభ్యులకు ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్ అందజేస్తున్న మిత్రులు

కోరుట్ల రూరల్, జూలై 17: మండలంలోని అయిలాపూర్ గ్రామానికి చెందిన బండి మధు ఇటీవల మృతి చెందాడు. బాల్యమిత్రులందరూ కలిసి రూ.2,42,500 సేకరించి మధు కూతురు పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. డిపాజిట్ బాండ్‌ను బుధవారం బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. ఆర్థిక సాయం అందజేసిన వారిని గ్రామస్తులు అభినందించగా, బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. యూత్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎంపీటీసీల ఫోరం మాజీ మండలాధ్యక్షుడికి సత్కారం


వెంకట్‌ను శాలువాతో సన్మానిస్తున్న ముదిరాజ్ సంఘం సభ్యులు

ఇబ్రహీంపట్నం, జూలై 17: మండలంలోని వర్షకొండ గ్రామంలో బుధవారం ఎంపీటీసీల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు కొనుకంటి వెంకట్‌ను స్థానిక ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. గ్రామస్తులకు ఆయన చేసిన సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

మొహర్రం వేడుకల్లో ఘర్షణ

కొడిమ్యాల, జూలై 17: మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన మొహర్రం వేడుకల్లో ఘర్షణ వాతావరణం నెలకొంది. మండల కేంద్రంలోని అంగడీ బజార్‌లో నిర్వహిస్తున్న వేడుకల్లో పీరీలు, వివిధ వేషధారణలో ఉన్న యువకులు ఒకేసారి చౌరస్తా వద్దకు చేరుకున్నారు. జనసందోహం ఎక్కువ కాడంతో వివిధ వేషధారణలో ఉన్న యువకులు ఒక్కసారి కేకలు వేస్తు సందడి చేయడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ సందీప్ సిబ్బందితో వచ్చి చెదరగొట్టాడు. ప్రశాంత వాతావరణలో పండుగలు జరుపుకోవాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పోలీసులు బస్టాండ్, పోలీస్‌స్టేషన్, వేంకటేశ్వరాలయం, తదితర ఏరియాల్లో పెట్రోలింగ్ నిర్వహించారు.

యువకులను చెదరగొడుతున్న ఎస్ఐ సందీప్, సిబ్బంది